క్రైట్స్ కాలేజ్ విద్యార్థినికి ప్రతిభ అవార్డు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: రాష్ట్ర ప్రభుత్వం 2024 - 25వ సంవత్సరంలో ప్రకటించిన ప్రతిభ అవార్డులలో క్రైట్స్ కాలేజీ విద్యార్థిని ప్రతిభ అవార్డ్ సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల విద్యార్థిని పి.సుప్రియ (988/1000) మార్కులు సాధించినందుకు బీసీ కేటగిరీలో ప్రతిభ అవార్డ్ సాధించిందన్నారు. అవార్డుకు 20000 రూ.20 వేలు, గోల్డ్ మెడల్ ప్రభుత్వం ఇస్తుందన్నారు. ప్రతిభ అవార్డ్ సాధించిన సుప్రియను కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, డైరెక్టర్లు రెడ్డి గణేష్, వి.ప్రసాద్, ఎ.శంకరరావు, అధ్యాపక బృందం అభినందించారు.

విరివిగా మొక్కలు నాటుదాం...పర్యావరణాన్ని కాపాడుకుందాం

విశాలాంధ్ర - నక్కపల్లి: ప్లాస్టిక్, పాలిథిన్ వాడడం చాలా ప్రమాదకరమని, పర్యావరణానికి తీవ్ర విఘాతం కల్గిస్తాయని, ఇవి పాయిజన్ కంటే ప్రమాదకరమని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ అన్నారు. మండలంలోని పెదబోదిగల్లం వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పరిశ్రమలశాఖ రాష్ట్ర సెక్రటరీ (సీనియర్ ఐఏఎస్) యువరాజ్, కలెక్టర్ విజయ్ కృష్ణన్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మార్కెట్లకు వెళ్లినప్పుడు చేతి సంచి, లేదా నూలుతో తయారు చేసిన బ్యాగులు తీసుకెళ్లాలని సూచించారు. సూసైడ్ చేసుకున్న వారు ఒక్కరే చనిపోతారని, పాలిథిన్ ఎక్కువగా వినియోగిస్తే స్లో పాయిజన్ ఆ భూతం మానవాళిని కబళిస్తుందని చెప్పారు. ఉమ్మడివిశాఖ జిల్లాపూర్వపు కలెక్టర్ యువరాజ్, కలెక్టర్ విజయ్ కృష్ణన్ను పెదబోదిగల్లం సర్పంచ్ మున్నీషా బేగం, ముస్లిం మత పెద్ద లు సత్కరించారు. కార్యక్రమంలో డీఎఫ్ వో లక్ష్మణ్, సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సునీల్ కుమార్, రేంజ్ ఆఫీసర్ అనిల్ కుమార్, నియోజకవర్గం టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, ఆర్డీవో వీవీవీ రమణ, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో డీ సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెదబోదిగల్లం వద్ద కారిడార్ నిర్వాసిత రైతులకు కేటాయించిన లే అవుట్ల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెలగా శ్రీను, వైబోయిన రమణ, వెలగా సుధాకర్, కోసూరి శ్రీను, దార్ల కృష్ణ, పెదపూడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: మానవాళి మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఎంతో ముఖ్యమని ఆదికవి నన్నయ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్స్లర్ డాక్టర్ ముర్రు ముత్యాల నాయుడు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక అయ్యన్న డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటే మనల్ని మనం రక్షించుకున్నట్లేనని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాసీం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సిమునిరి రమణ, గాడి అప్పారావు , ప్రిన్సిపాల్ సుమతి విద్యార్థులు పాల్గొన్నారు.

గొలుగొండ: ప్రకృతి పరిరక్షణ మానవ బాధ్యతని, విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే భవిష్యత్తు తరాలకు మనుగడ ఉంటుందని నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురామ చంద్రరావు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నాగాపురంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పట్టణాలు, నగరాల్లో మాత్రమే ఉన్న పర్యావరణ కాలుష్యం నేడు పల్లెలకు సైతం వ్యాపించిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పి.సుబ్రహ్మణ్యం, మర్రి వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట: మండలంలోని వడ్డాది గ్రామ పంచాయతీ కార్యాలయంలో ధరిత్రి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ రమ్య, వైస్ ఎంపీపీ నారాయణాయ మూర్తి, ఏపీఎం రాజబాబు, ఐకేపీ, సంస్థ నిర్వాహకులు సుంకర నానాజీ, సోషల్ వర్కర్ ఆకుల నాగేశ్వరరావులు హాజరై పర్యావరణంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.

కోటవురట్ల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఉపాధి ఏపీవో నాగరాజు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వివిధ గ్రామాల్లో ఉపాధి ఫల్డ్ అసిస్టెంట్లు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కోటవురట్ల గ్రామం మరిడి తల్లి గుడి దగ్గర మొక్కల నాటే కార్యక్రమం చేపట్టారు. కైలాసపట్నం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ సప్పారపు జ్యోతి ఆధ్వర్యంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు భీముని మాణిక్యాలరావు ఉపాధి మేట్లు శ్రామికులు గ్రామంలో పలుచోట్ల మొక్కలు నాటారు. కోటవురట్ల చౌడువాడ, గొట్టివాడ, పందూరు, పాములవాక, జల్లూరు, కే వెంకటాపురం గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి మేట్లు పాల్గొన్నారు.

సబ్బవరం: మండల కేంద్రంలోని స్థానిక సబ్బవరం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రంథాలయం అధికారిణి వి.శిరీష ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్వాడి టీచర్ లక్ష్మి, ఆశ వర్కర్ అనురాధ, పలు పాఠశాలల విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

గొర్లివానిపాలెం గ్రామంలో పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి, ఏపీ ఆయిల్ ఫీడ్ చైర్మన్ గండి బాబ్జి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల ఆక్సిజన్ పొందడంతో పాటు వాయు కాలుష్యంను నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా తెలుగు యువత అధ్యక్షులు పీబివిఎస్ఎన్ రాజు, సబ్బవరం మండల పార్టీ అధ్యక్షులు గండి ముత్యాలయుడు, మాజీ ఎంపీపీ గండి దేముడు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, తమరాన బంగారు నాయుడు, అంగటి నానాజీ, గండి దేముడు, ఎంపిటిసి గొర్లి కృష్ణ చైతన్య, గొర్లి కృష్ణ, గొర్లి త్రిమూర్తులు, గొర్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: ప్రతి పౌరుడు విధిగా మొక్కలు నాటి.. చెట్లు పెంచే బాధ్యతను తీసుకోవాలని జనసేన నాయకుడు పంచకర్ల ప్రసాద్ తదితరులు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవంను పురస్కరించుకొని గురువారం ఈ.బోనంగి విఎంఆర్డిఎ బల్క్ ల్యాండ్ అండ్ పవర్ సిటీ వద్ద వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రాబోయే తరం, పుట్టబోయే పిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నా.. మనం పీల్చే గాలి స్వచ్ఛంగా ఉండాలన్నా.. మొక్కలు నాటి ప్రతి రోజూ వాటికి నీళ్లు పోసే విధంగా పిల్లలకు అలవాటు చేయాలన్నారు. శ్రీ సిద్ధి వెంకటేశ్వర హార్టికల్చర్ అండ్ సివిల్ వర్క్స్ లాలం అప్పలనాయుడు, శ్రీమతి ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచులు బొద్ధపు శ్రీనివాస్, సిరిపురపు అప్పలనాయుడు, నాయకులు బుగుడి రామ గోవిందరావు, రెడ్డి శ్రీనివాసరావు, గొర్లి శ్రీనివాస్, మేడిశెట్టి అప్పారావు, కూండ్రపు సోమునాయుడు, మేడిశెట్టి బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల వద్ద డిప్యూటీ ఎంపీడీవో సిహెచ్ చంద్రశేఖరరావు మొక్కలు నాటారు. మండలంలోని పెదరామభద్రపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు కలిగట్ల శ్రీనివాసరావు, సింగంశెట్టి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు దుర్గాప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన అచ్యుతాపురం ఏపీ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్లో పర్యావరణని కాపాడండి, ప్లాస్టిక్‌ను నివారించండి అనే నినాదంతో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల జీవరాశు లకు అనేక అనర్ధాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యస్.రాయవరం: ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు పెంచడం వల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతాదని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. గురువారం మండలంలో పెనుగొల్లు గ్రామంలోని పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల భూ వాతావరణం వేడి తగ్గుతాదని దీనివల్ల సకాలంలో వర్షాలు కురుస్తాయని అన్నారు. మొక్కల పెంపకానికి ప్రభుత్వము

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సహకరిస్తుందని కావున ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ పథకం శ్రామికులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వివి రమణ, డూమా పిడి పూర్ణిమ దేవి, తహసిల్దార్ జె.రమేష్ బాబు, ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీఓ ఎర్రకయ్య, సర్పంచ్ ఉద్దండం నాగ శ్రీదేవి, మండల టిడిపి అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, టిడిపి సీనియర్ నాయకులు గుర్రం రామకృష్ణ, పల్లెల బుజ్జి, గోరింట్ల సత్తిబాబు(ఆశ) ,ప్రగడ తులసి, చిన్న దేవుళ్ళు ,వైసిపి నాయకులు ఉద్దండం సూర్యనారాయణ, వెంకటరత్నం(బాబి) తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగష్టు నుండి హామీ పథకాల అమలు: ఎమ్మెల్యే రాజు

విశాలాంధ్ర - చోడవరం: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ పథకాలను పంద్రాగష్టు నుండి ప్రారంభం చేస్తామని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1500లు రెండు పథకాలను దశల వారీగా పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేసారని అన్నారు. ఫించన్ల పెంపుతో కొంచెం ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చోడవరం మాజీ జెడ్పీటీసీ కనిశెట్టి మత్సరాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - పాయకరావుపేట: కోస్టల్ సెక్యూరిటీ డిఐజి గోపినాథ్ జెట్టి, విశాఖపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ ఆడిషనల్ ఎస్పీ జి.బి.ఆర్. మధుసూదనరావు ఆదేశాలు మేరకు పెంటకోట కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సిఐ వై.మురళి రావు, ఎస్సై రత్నశేఖర్, ఏఎస్ఐ కృష్ణ, స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎన్.సంకీర్తి, డాక్టర్ జి.స్వరాజ్యం, ఎంపిహెచ్ఈఓ పి.రాముడు, సూపర్వైజర్లు కె.శ్రీనివాసరావు, డి.హేమంత, నాయుడు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల పనిగంటల పెంపు దుర్మార్గం

విశాలాంధ్ర - మునగపాక: రాష్ట్రంలో పనిగంటలు పెంచుతూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం పచ్చి దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ధ్వజమెత్తారు. కార్మికల సంక్షేమం దృష్ట్యా లేబర్ కోడ్స్ అమలును రాష్ట్రంలో తక్షణమే నిలిపివేయాలని, 8 గంటల పని కోసం 1886 చికాగో నగరంలో పోరాడి సాధించుకున్న కార్మికవర్గంపై 12 గంటల పనిని రుద్దుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజా వ్యతిరేకం అని మండిపడ్డారు. కార్మికుల రక్తమాంసాలు పిండి కార్పొరేట్‌లకు ఇబ్బడిముబ్బడిగా లాభాలు కట్టబెట్టేందుకే చంద్రబాబు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం బాధాకరం అన్నారు. పని గంటలు తగ్గించి అదనపు ఉపాధిని కల్పించాల్సింది పోయి నిరుద్యోగాన్ని పెంచే ఈ చర్య అభివృద్ధి నిరోధకమన్నారు. దీనికి వ్యతిరేకంగా జూలై 9న జరగనున్న జాతీయ సమ్మెకు కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కొండెంపూడిలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలకు ప్రతిపాదనలు

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: మండలంలోని కొండెంపూడి గ్రామంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం సమీపంలోని కెవికె కేంద్రానికి అనుబంధంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించినట్లు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. చోడవరం మండలంలోని గంధవరం గ్రామంలో నిర్మిస్తున్న విత్తన శుద్ధి కేంద్రం గిడ్డంగి నిర్మాణం పూర్తికావచ్చిందని త్వరలోనే ప్రారంభిస్తామని, అదేవిధంగా చోడవరం పట్టణంలోని రైతు బజార్ కేంద్రం త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు.

వెలుగు కార్యాలయంలో యోగా శిక్షణ

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల వెలుగు కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మహిళలకు యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిక్షణలో 60 మంది మహిళలు పాల్గన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కొంకి అప్పారావు మాట్లాడుతూఈ నెల 21న విశాఖ ఆర్కే బీచ్‌లో ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో జరిగే యోగా కార్యక్రమానికి 5లక్షల మంది హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపిఎం బి.కొండలరావు, యోగా ట్రైనర్లు, వీఓఏలు పాల్గన్నారు.

సత్యవరంలో రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం సత్యవరం గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి వారి విగ్రహ, నూతన ఆలయ ప్రతిష్ట మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం ప్రతిష్ఠా మహోత్సవంను ఘనంగా జరిపించారు. ముఖ్య అతిథిగా మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ఎంపీపీ తాళపురెడ్డి రాజారామ్, మాజీ ఎంపీపీ పెదబాబు, సర్పంచ్ జెర్రిపోతుల నాగమణి పాల్గొన్నారు.

హెరిటేజ్ ఉచిత పశు వైద్య సేవలు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: హెరిటేజ్ డెయిరీ ద్వారా పాడిరైతుల పశువులకు ఉచిత పశు వైద్య సేవలు అందిస్తున్నామని డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. గురువారం మండలంలో దుప్పుతూరు గ్రామంలో హెరిటేజ్ పాడిరైతుల పశువులకు ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు హేమసుందర్ 21 పశువులకు డి వార్మింగ్ చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సిహెచ్ రాము, పాడిరైతులు నూకరాజు, శంకర్రావు, రమణారావు, రాము, అప్పారావు దేవుడు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

చౌడువాడలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర - కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో గురువారం శంకర ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు ప్రారంభించారు. ఈ శిబిరంలో 80 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించగా 38 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరందరికీ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లను నిర్వహిస్తారని ఆప్తమాలజిస్ట్ అధికారి డాక్టర్ ఆర్.దేవి అన్నారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్ సిహెచ్ అశ్విని కుమార్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శరణ్య వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రారంభోత్సవం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో శ్రీ శరణ్య వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రారంభ కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామంలోని ధర్మకర్త ఉప్పలపాటి వెంకట సూర్యనారాయణ రాజు(రవి రాజు) ఆధ్వర్యంలో నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమాలు అనంతరం గురువారం ఉదయం స్వామి వారి విగ్రహం దర్శనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామివారి కళ్యాణం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేయడంతో భక్తులు వచ్చి అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

విశాలాంధ్ర - సబ్బవరం: ఈనెల 21న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో మండల పరిషత్ సమావేశ మందిరంలో యోగా మీద 10-18,19-35,35 సంవత్సరాలు పైబడిన వారికి పెయింటింగ్ కాంపిటీషన్ నిర్వహించినట్లు ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. ఈ పోటీలకు 10-18 వయస్సు గల పిల్లలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి చైతన్య, పిడి మాస్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

సద్గురు శ్రీ చెన్నారావు గురూజీ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర - సబ్బవరం: సద్గురు శ్రీ చెన్నారావు గురూజీ సేవలు ప్రశంసనీయమని శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామి, డైరెక్టర్ గొంప దేముడు అన్నారు. మండలంలోని ఆదిరెడ్డిపాలెం గ్రామంలో సద్గురు కే.ఏ.స్వామీజీ ధ్యాన మందిరంలో గురువారం సద్గురు చిన్న స్వామీజీ సప్తమ (7వ) సమాధి ఆరాధనోత్సవం ధ్యాన మందిరం డైరెక్టర్ గొంప దేముడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం 5 గంటల నుండి సద్గురు శ్రీ చెన్నారావు గురూజికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గండి దేముడు(మేస్త్రి),సబ్బవరపు పైడమనాయుడు, సింగంపల్లి నాగరాజు, కామిరెడ్డి లక్ష్మి, తులసీదాస్ నీలకంఠం, అనిల్ డాక్టర్, గురు సేవకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం: కలెక్టర్

విశాలాంధ్ర - యస్.రాయవరం: జిల్లాలో ఈ సంవత్సరం ఐదువేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా నిర్దేశించినట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. గురువారం వమ్మవరం గ్రామంలో పల్లెల వెంకటరమణ పొలంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటి మెగా ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పల్లెల రామారావుకు చెందిన కొబ్బరి తోటలో అంతర పంటగా కోకో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం ఐదువేల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. రానున్న రెండు నెలల కాలంలో ఐదువేల ఎకరాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఆయిల్ ఫామ్ సాగు ప్రోత్సహించుటకు హెక్టారుకు మొక్కలు కొనుగోలుకు 30 వేల రూపాయలు, ఎరువులకు నాలుగు సంవత్సరాలలో 20 వేల రూపాయలు, అంతర్ పంటలు సాగుకు 21 వేల రూపాయలు అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులకు లాభం చేకూర్చే విధంగా అంతర్ పంటలుగా కోకో సాగు చేసుకోవాలని తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా రైతులు పల్లెల వెంకటరమణ, పల్లెల రామా రావులను కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వివి రమణ, తహశీల్దార్ జె.రమేష్ బాబు, ఎంపీడీవో సత్యనారాయణ, మండల ఉద్యాన అధికారి సాయి ప్రియ, మండల వ్యవసాయ అధికారి సౌజన్య, మండల టిడిపి అధ్యక్షులు అమలకంటి అబద్ధం, టిడిపి సీనియర్ నాయకులు గుర్రం రామకృష్ణ, ఎస్.వెంకటరాజు, పల్లెల బుజ్జి, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు దుబాసి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

82 లక్షల మొక్కల పెంపకం లక్ష్యం: డీఎఫ్ఓ

విశాలాంధ్ర - నక్కపల్లి: ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో అనకాపల్లి జిల్లా పరిధిలో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 82 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్ణయించామని జిల్లా అటవీశాఖాధికారి జి.లక్ష్మణ్ చెప్పారు. గురువారం నక్కపల్లి వచ్చిన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు.

2047 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో అటవీ భూముల శాతం పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 90 నర్సరీలు ఏర్పాటు చేసి, పంపిణీకి మొక్కలను సిద్ధంగా వుంచామన్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పేపర్ మిల్స్, ఉద్యానవన శాఖ, డుమా, అటవీశాఖల సమన్వయంతో మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా నాటే 82 లక్షల మొక్కల్లో సరుగుడికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇది తక్కువ పెట్టుబడితో రైతులకు అధిక లాభాలిస్తుందన్నారు. దాదాపు 70 లక్షల మొక్కలు సరుగుడు నాటుతామని, మిగిలిన 12 లక్షల మొక్కలు పలు రకాల జాతులుంటాయని చెప్పారు. రైతుల పొలాల్లో కూడా సరుగుడు పెంచుకోవడానికి ఉచితంగా నారు ఇస్తామని చెప్పారు. ఎప్పటికప్పుడు నర్సీపట్నం, అనకా పల్లి, యలమంచిలి, చోడవవరం రేంజ్ కార్యాలయాల పరిధిలో ఎప్పటికప్పుడు మొక్కల పెంపకంపై మోనట రింగ్ చేస్తామని చెప్పారు. ప్రతీ ఒక్కరూ కాలుష్య నివారణకు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటడం శ్రేయస్కరమని డీఎఫ్ వో లక్ష్మణ్ సూచించారు.

చెరకు రైతును ఆదుకునేదెవరు..?

విశాలాంధ్ర - చోడవరం: గోవాడ సుగర్స్‌ను ఆదుకుంటామని, పూర్వ వైభవం తీసుకొస్తామని కార్మికులను కర్షకులను నమ్మబలికిన కూటమి నాయకులు మోసం చేసారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న ఆరోపించారు. రాష్ట్రంలో సహకార రంగానికి రోల్ మోడల్‌గా నిలిచిన గోవాడ సుగర్స్‌ను శిధిలావస్థకు వెంటిలేటరుపై చేర్చిన ఘనత కూటమి నాయకులదే అన్నారు. చోడవరం, మాడుగుల నియోజక వర్గాల్లో లక్ష మందికి పైగా కర్షకులు, కార్మికులు చెరుకు పండిస్తూ, గోవాడ సుగర్స్ పైన ఆధారపడి జీవిస్తుండగా, కూటమి నాయకులు మాత్రం డిస్టనరీ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని సాధ్యా సాధ్యాలపై సర్వే చేయకుండా రైతాంగాన్ని నమ్మిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం 5 ఏళ్లలో రూ.89 కోట్లు నిధులు ఇచ్చి షుగర్ ఫ్యాక్టరీను ఆదుకోగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2023-24 సీజన్లో చెరుకు సప్లై చేసిన రైతులకు చెల్లించవలసిన టన్నుకు రూ.150 కూడా ఇవ్వలేదని అన్నారు. ప్రభుత్వ సహకారం ఉంటేనే తప్ప రైతులను, కార్మికులను ఆదుకునే పరిస్థితి లేదని, భవిష్యత్తు అంధ కారమని తెలిసినా దశాదిశా ముందుకు ఎలా సాగుతుందో దిక్కు తోచని స్థితిలో జూన్ నెల వచ్చినా చెరుకు పంట సాగుచేయాలో వద్దో తెలియని అయోమయంలో రైతులు ఉన్నారన్నారు. క్రషింగ్ సీజన్‌కు ముందు ప్రతి 15 రోజులకు పేమెంట్లు ఇస్తామని, ప్రభుత్వం నుండి నిధులు తీసుకొస్తామని హామీలు ఇచ్చిన ఎం.పి. సి.ఎం రమేష్ కార్యాచరణలో శూన్యమన్నారు. కార్మికులకు నెలలు తరబడి జీతాలు ఇవ్వకపోగా అన్ సీజన్ పేరిట ఎక్కువమంది కార్మికులను ఇంటికే పరిమితం చేయడంతో భార్య పిల్లలతో బతకలేక, బ్రతుక బండిని ఈదలేక, అసలు ఉద్యోగం ఉందో లేదో తెలియక, అరకొర పస్తులతో, అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోవాడ సుగర్స్ ను నమ్ముకున్న కార్మికులు, కర్షకులకు బకాయిలు చెల్లించి న్యాయం చేయాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారు.